# శిక్ష

-వీరభద్రరావు పమ్మి

"ఆ పెన్ నువ్వు తీసినట్టు తెలియాలి, నీ భరతం పడతాను." స్కూలు కెడుతున్న కొడుకు వినయ్‌ని చూసి కేశవ రావ్ కోపంగా అన్నాడు.

"నిజం! ఒట్టు నాన్నా! నీ పెన్ తియ్య లేదు." బిక్క మొహంతో చెప్పాడు



వినయ్. వాడికి దుఃఖం పొంగుకొస్తోంది.

"సరేలే-వెళ్ళు!"

వినయ్ తడబడుతున్న అడుగులతో స్కూలు కెళ్ళిపోయాడు.

వంటింట్లోంచి ఇదంతా విన్న సుభాషిణి భర్త దగ్గరకొచ్చి, "వాడు తియ్యలేదు మొర్రో అంటూంటే వినిపించుకోరేం? విన్నంతా



కథా నిలయం
శ్రీకాకుళం

అయ్యిందిగా భాగోతం. మళ్ళీ పొద్దున్నే మొదలెట్టారా?" అంది.

"నువ్వలా వెనకేసుకుని రాబట్టే వాడలా తగులబడుతున్నాడు. వాడి అల్లరికి హద్దూ పద్దూ లేకుండా పోతోంది."

తన తప్పును వేలెత్తి చూపితే ఏ మగాడూ సహించలేడు. ఏదో

రకంగా సమర్థించుకో ప్రయత్ని స్తాడు. కేశవరావ్ మాటల్లో అదే ధ్వనించింది. సుభాషిణి వస్తున్న నవ్వుని ఆపుకుంటూ లోపలికెళ్ళి పోయింది.

* * *

రెండు రోజులుగా కేశవరావ్‌కి మనశ్శాంతి లేదు. జేబులో డబ్బు ల్లేకపోవడం వల్ల కాదు, ఆఫీసరు తిట్టినందువల్ల కాదు, కిర్సనాయిల్ కోసం క్యూలో నిలబడ లేక కాదు.

అతని పెన్ కనబడ్డం లేదు.

అది పోనీ ఏ షీఫర్సో, పార్కరో కాదు.

అతను బి.ఏ. పాసైనప్పుడు అతని తండ్రి ఆప్యాయంగా కొనిచ్చిన రత్నం పెన్. పోయింది తండ్రి తాలూకు వస్తువు కాబట్టి కేశవరావ్ దృష్టిలో దానికి గొప్ప సెంటిమెంటల్ వాల్యూ వుంది. పోయిన ఆ పెన్ కోసం ఇల్లంతా వెతికాడు. ఆఫీసంతా గాలించాడు. ఏ స్నేహితునికో ఇచ్చి మర్చిపోయి ఉంటానన్న ఉద్దేశ్యంతో అందర్నీ అడిగాడు. భార్యనడిగాడు. కొడుకు వినయ్‌ని అడిగాడు. అంతా కూడా తెలియదనే అన్నారు.

అది ఎక్కడేనా పడిపోయుంటుందన్న అనుమానం ఓ మూల అతన్ని పీకుతున్నా—కొడుకు వినయ్ దాన్ని తీసుంటాడనీ, వాడు స్కూల్లో పడెయ్యడమో, ఎవరికేనా ఇచ్చెయ్యడమో చేసుంటాడని అతనికి గట్టిగా అని పిస్తోంది.

దాని క్కారణం లేకపోలేదు.

నెల క్రితం ఓ సారి ఇలాగే పెన్ కనబళ్ళేదు. దాని కోసం తెగ గాలించాడు. అయినా దాని ఆచూకీ తెలియ లేదు. మర్నాడు యధాలాపంగా ఆరేళ్ళ కొడుకు వినయ్‌ని అడిగాడు.

"నా పరీక్షలు కదా-అందుకని నీ పెన్ తీసుకున్నాను" అని పుస్తకాల పెట్టెలోంచి పెన్ తీసి ఇచ్చాడు.

ఈ సారి కూడా వాడే తీసుంటాడని కేశవరావ్ అనుమానం. వినయ్ మాత్రం ససేమిరా నాకు తెలియదంటున్నాడు. తండ్రి బతిమాలాడు. కొత్త బట్టలు కుట్టిస్తానని ఆశ చూపాడు. అయినా లాభం లేకపోయింది.

పోనీ ఇంకాస్త భయపెట్టి, బెదిరించి అడుగుదామంటే భార్యా పడనివ్వడం లేదు.

"క్రితం సారి వాడంతట వాడే ఇవ్వ లేదూ? తియ్యలేదంటుంటే వాణ్నలా భయపెట్టి చంపేస్తారెం

దుకు? వాడు తీసుండడు" అంటుం దామె.

కేశవ్‌రావ్‌కి అందులో కొంత రీజనింగ్ కనబడింది. కాని అతని క్కనబడాల్సింది పెన్.......రీజ నింగ్ కాదు.

అతనికేం తోచడం లేదు.

* * *

సాయంత్రం ఇంటికొచ్చిన కేశవరావ్‌కి పక్కవాటాలో గొడవ వినిపిస్తోంది.

పక్క వాటాలో రాధ గట్టిగా ఏడుస్తోంది. ఆమె భర్త రామారావు రంకె లేస్తూ, హుంకరిస్తూ గట్టిగా మాట్లాడుతున్నాడు. ఆమె మధ్య మధ్యలో అతనితో కోపంగా, గట్టిగా మాట్లాడుతోంది. రామారావు మరీ రెచ్చిపోతున్నాడు.

"మళ్ళీ ఏమైంది- గురుడు అరుస్తున్నాడు?" కేశవరావ్ భార్య నడిగాడు.

"కా త్తేముంది? మామూలేగా! ఆవిడ కూరలు తెచ్చుకోడానికి బజారు కెళ్ళింది. ఈయనగారు ఇంటి కొచ్చేసరికి తాళం వేసి వుంది. ఆమెను వెతుక్కుంటూ బజారు కెళ్ళాట్ట. ఆమె కనబళ్ళేదు. 'నువ్వు కూరల కోసమని వంక పెట్టి ఎవడితోనో పోయుంటావ్' అంటాడతను..."

సుభాషిణి చెప్పడం పూర్తి కానేలేదు. పక్క వాటాలోని గందరగోళం ఎక్కువయ్యింది.

"ఇంట్లోంచి బైటకు పో ముండా! అయినా రంకు ముండకి పెళ్ళెందుకు? నా కర్మ కాలి నిన్ను కట్టుకున్నాను." రామారావ్ అరుస్తున్నాడు.

"నోటికొచ్చిన మాటల్లా అన కండి. నేను ఎలాటి దాన్నో లోక మందరికీ తెలుసు. మీ బుద్ధి మంచిది కాదేమో-నేనలా కనిపిస్తు న్నాను." రాధ ఎదురు అంటోంది.

మాటా మాటా పెరిగిపోతూనే ఉంది. రామారావ్ ఆమెను దభీ దభీ మని గట్టిగా కొట్టిన చప్పుడు. ఆమె ఏడుపు పెరిగిపోయింది.

సుభాషిణి లోపలికెళ్ళిపోయింది. కేశవరావు పేపర్‌లో తల దూర్చాడు.

రామారావ్ దంపతులు ప్రక్క వాటాలోకి అద్దెకొచ్చి ఆర్నెల్ల య్యింది. అతనేదో కంపెనీలో పని చేస్తాడు. అతని భార్య రాధ ఓ స్కూల్లో టీచర్‌గా పని చేస్తుంది. వాళ్ళకి పెళ్ళయి ఓ సంవత్సరం దాటింది.

వాళ్ళు వచ్చిన కొత్తలో, రామా రావ్‌ని పరిచయం చేసుకుని స్నేహం పెంచుకోవాలని కేశవరావ్

సరదాపడ్డాడు. ఇరుగు పొరుగు వాళ్ళతో స్నేహంగా, కలిపి మెలిసి ఉండాలని అతని అభిప్రాయం. కాని రామారావు తప్పించుకు తిరగడం, ముభావంగా ఉండటం గమనించి చొరవ తీసుకోలేదు.

కొద్ది రోజుల్లోనే రామారావు అతనికి పూర్తిగా అర్థమయ్యాడు. అతను రిజర్వుడుగా ఉండే మనిషి. అంతేకాదు-అతనికి భార్యమీద విపరీతమైన అనుమానం. ఆడది వంటఇంట్లోనే పడి ఉండాలనీ, పరాయి మగవాడితో పన్నెత్తి పలకకూడదనీ, కన్నెత్తి చూడకూడదనీ అతని అభిప్రాయం. ఆమె ఎక్కడకు వెళ్ళినా ఆరాతీస్తాడు. ఆఖరికి ఆమె కూరలు కొనడానికి వెళ్ళినా అతనికి అనుమానమే. ఆమెను ఎవరిళ్ళకీ వెళ్ళనివ్వడు. కనీసం ఆమెతో పనిచేసే లేడీటీచర్ల ఇళ్ళకి వెళ్ళడం కూడా అతని కిష్టం వుండదు. ఆమె ప్రవర్తన మీద అతనికున్న అనుమానం దాచుకోడు. సాధ్యమైనంత కఠిన పదజాలంతో ఆమెకు తెలియబరుస్తాడు.

'భార్య రూపవతి శత్రుః' అన్న సామెతవల్ల ననుకుంటే ఆమె సామాన్యంగా వుంటుంది. వంటినిండా కొంగు కప్పుకొని, తలొంచుకొని వెడుతుంది. వెకిలితనంగా ప్రవర్తించడం, అతిగా ఉండటం, మాట్లాడడంలాంటివి కూడా ఏమీ చెయ్యదు.

రాధ మేనత్త కొడుకు రామకృష్ణ అనే అతను ఆ ఊళ్ళోనే ఉద్యోగం చేస్తున్నాడు. అతనప్పుడప్పుడు వీళ్ళింటికి వస్తూండేవాడు. రామకృష్ణ కలివిడిగా ఉండే మనిషి.

రామారావ్‌కి వాళ్ళిద్దరి మీదా అనుమానం. రామకృష్ణ రావడం అతని కిష్టం లేదు. అతను వచ్చినప్పుడల్లా ముభావంగా ఉండటం మొదలెట్టాడు. రాధ స్కూలు నుంచి కాస్త లేటుగా వచ్చినా, భర్త వచ్చేసరికి ఆమె ఏ ప్రక్కింటికో వెళ్ళినా, "ఏం ఆ కిష్టిగాడితో పోయావా?" అంటాడు.

రామారావ్ తత్త్వం తెలుసుకున్న రామకృష్ణ వాళ్ళింటికి రావడం మానుకున్నాడు.

రాధ బాధ పడింది.

"మేనత్తా, మేనమామ బిడ్డలయినంత మాత్రాన చెడ్డ సంబంధం వుందని ఎందు కనుమానిస్తారు?" అని భర్తనడిగితే, "లేదని గారంటీ ఏమిటి? లేకపోతే ఎందుకు వాడితో ఆ పకపకలు, ఇకఇకలు" అన్నాడు.

రాధ ఉద్యోగం మానేస్తానని చెప్పింది- అతని బాధ పళ్ళేక.

"ఉద్యోగం మానెస్తే మాత్రం

(మిగతా కథ 77వ పేజీలో)

తిన్నగా ఉంటావని గారంటీ ఏమిటి?" అన్నాడతను.

రాధకు సుభాషిణి ఒక్కతే ఎంతో ఆత్మీయురాలు. వీలు చిక్కితే తన బాధనంతా ఆమెతో వెళ్ళబోసుకుంటుంది.

"పెళ్ళంటే ఎంతో ఊహించుకునేదాన్ని. ఇంత నరకంగా వుంటుందంటే అసలు చేసుకునేదాన్నే కాదు. రామకృష్ణ నా కన్నా ఒక సంవత్సరం చిన్నవాడు. మా మధ్య చెడ్డ ఆలోచనలే రావు. వాడితో నాకు సంబంధం వుందంటారు. మొన్నోసారి సినిమాకెడితే ఎవడో నన్ను చూసి నవ్వేట్ట. నేనసలు చూడనే లేదు. ఇంటికొచ్చాక, 'ఎవడా బొద్దు మీసాల వెధవ? నీకెప్పట్నుంచి తెలుసు? మీ ఇద్దరి పరిచయం ఎలాంటిది?' అని నానా రగడా చేశారు. పెళ్ళయిన సంవత్సరంలోనే వైవాహిక జీవితం మీదే కాదు- అసలు జీవితంమీద విరక్తి పుట్టేసింది. చచ్చిపోవాలనిపిస్తోంది. కాని ధైర్యం చాలడం లేదు. నా ఖర్మకాలి ఈయన్ని కట్టుకున్నాను."

ఇలా సుభాషిణితో చాలాసార్లు చెప్పుకుని బాధపడింది రాధ.

మొగుడు తాగుబోతు, తిరుగుబోతు, తుంటరి, రాస్కెలున్నర రాస్కెల్ అయినా సరే-వాడిలో ఉన్న మంచిని గుర్తించి మానసిక తృప్తి పెంచుకుని-వాణ్నే కొలిచి ఆరాధించి, 'ఈయనే నా భర్త' అని చెప్పుకుని గర్వించే, ఆనందించే ఈ దేశంలోని స్త్రీ, 'నా ఖర్మ కాలి కట్టుకున్నాను' అందంటే ఆమెలో ఎంత అసంతృప్తి నిండుకుని వుందో—ఆమె మానసికంగా ఎంత కాగి, వేగి, వేసారి పోయిందో అర్థమౌతుంది.

"చచ్చిపోవాలనిపిస్తుంది. కాని ధైర్యం చాలడం లేదు." ఆమెకు ఆ ధైర్యమే వస్తే....?

సుభాషిణి ఆమెను ఓదార్చి, పరిస్థితులు చక్కబడతాయని, ఓపిక పట్టమని చెప్పి—దైన్యమైన ధైర్యం నూరిపోసి పంపిస్తుంటుంది.

సుభాషిణి ద్వారానూ (పక్కవాటాకి వీళ్ళ వాటాకి మధ్య తలుపు మాత్రమే అడ్డు) రామారావ్ కేకలు, అరుపులు స్పష్టంగా వినిపించడం వల్లా- కేశవరావ్‌కి ఎప్పటికప్పుడు విషయాలన్నీ తెలుస్తుంటాయి.

రామారావ్ అమానుష ప్రవర్తనకి కేశవరావ్ గుప్పిళ్ళు బిగుసుకుంటాయి. అతన్ని పిల్చి గట్టిగా బుద్ధి చెప్పాలనిపిస్తుంది. అవసరమైతే నాల్గు తన్నా లనిపిస్తుంది. కాని అంతలోనే మరొకళ్ళ స్వంత విషయంలో జోక్యం చేసుకోడం తప్పనిపిస్తుంది.

అదీగాక రాధను వెనకేసుకొచ్చి మాట్లాడినందుకు ఆమెతో తనకు సంబంధం అంటగడితే?

ఉపకారం చేద్దామన్న ఉద్దేశంతో ఆమెకు అపకారం చెయ్యడమే అవుతుంది.

ఆమెమీద సానుభూతి, రామారావు మీద నిరసన భావం పెంచుకోడం తప్ప ఏమీ చెయ్యలేని పరిస్థితి.

సుభాషిణి చెప్పిన మరో విషయం కేశవరావ్‌కి నవ్వుని, కోపాన్ని కలుగజేసింది.

రాధ పూర్వం సుభాషిణి నడిగి వీళ్ళింటిలోంచి పుస్తకాలు తీసుకెళ్ళేది. "ఆ పుస్తకాలు చదవకపోతే చచ్చిపోతావా?" అన్నాట్ట రామారావ్. ఆ పుస్తకాల ద్వారా కేశవరావ్‌కి, రాధకి ఏమైనా ప్రేమలేఖలు నడుస్తాయని అతని భయమట.

రామారావ్ రాధ మీద అంతగా అనుమానం ఎందుకు పెంచుకున్నాడో అతనికి అర్థం కాలేదు. చాలా సంసారపక్షంగా ప్రవర్తించే మనిషి రాధ.

కేశవరావ్‌కి ఎప్పుడో తను చదివిన సైకాలజీ పుస్తకం జ్ఞాపకమొచ్చింది. అందులో భార్యమీద మగాడు అనుమానం పెంచుకోడానికి కొన్ని కారణాలు సూచించాడు రచయిత.

తన ఇంట్లో వాళ్ళుకాని, బాగా తెలుసుకున్న వాళ్ళుగాని-ఆడవాళ్ళు-వైవాహిక వ్యవస్థకుముందే బయట చెడ్డ సంబంధం పెట్టుకోడం.....

వివాహం ముందు మగాడు పరాయి స్త్రీలతో సంబంధాలు కలిగి వుండడంవల్ల, భార్య కూడా అలాంటి సంబంధాలు ఉండి ఉంటాయని భావించడం....

తన పురుషత్వం మీద తనకే అపనమ్మకం కలగడం....

అప్పుడప్పుడు ఆమె ప్రవర్తన మీద అనుమానం వెలిబుచ్చితే ఆమె భవిష్యత్తులో జాగ్రత్తగా వుంటుందని వూహించడం వలన...

రామారావ్ ఇందులో ఏ రకానికి చెందుతాడో తెలియదు గాని-రాధ మీద మాత్రం అతనికి విపరీతమైన అనుమానం.

* * *

కేశవరావ్ పెన్ ఉదంతం అలాగే ఉండిపోయింది. కొడుకు వినయ్ స్కూల్లో ఎవరికో ఇచ్చేసి ఉంటాడని అతను నిర్ధారించుకున్నాడు.

పెన్ విషయం జ్ఞాపకమొచ్చినప్పుడల్లా అతని మనసు వికలమైపోతుంది. కొడుకుని తిడుతూనే వున్నాడు. వాడు- "నాకేం తెలియదు నాన్నా!" అంటూనే వున్నాడు.

ఇంతలో సంక్రాంతి సెలవులిచ్చారు. సుభాషిణి కొడుకుని తీసుకుని పుట్టింటి కెళ్ళింది.

ప్రక్కింటి భాగోతంలో ఏమీ మార్పులేదు. తిట్లు, కేకలు, బూతులు, రంకులు, ఏడ్పులు, పెడబొబ్బలు, దెబ్బలు, తన్నులు....

నిద్రపోతున్న కేశవరావ్‌కి చటుక్కున మెలకువ వచ్చింది. ప్రక్కవాటాలోంచి మాటలు వినిపిస్తున్నాయి. రామారావ్ కంపెనీ పని మీద పొరుగూరు వెళ్ళాడని అతనికి తెలుసు. ఇంత రాత్రిపూట ఎవరై వుంటారా అని ఆలోచిస్తున్నాడు. రాధ మాట తెలుస్తోంది. రెండో మనిషి ఎవరో అర్థం కాలేదు. మెల్లగా లేచి రెండు వాటాలకు మధ్యలో వున్న తలుపు దగ్గరగా వెళ్ళి జాగ్రత్తగా వింటున్నాడు.

"అది కాదు రాధా! నే వచ్చినట్లు తెలిస్తే ఆయన నానా అల్లరి చేస్తాడేమో?" రామకృష్ణ మాట్లాడుతున్నాడు.

"తెలిసినా ఏం ఫరవాలేదు. ఆయనతో మామూలుగా ఉండే గొడవేగా? ఆయన మరో రెండు రోజులు దాకా రారు. ఈలోగా మనిష్టం...." రాధ గొంతు.

"కాని రాధా!..."

రామకృష్ణను మధ్యలోనే ఆపేసింది రాధ.

"ఇంకేం చెప్పకు. ఆయనకు తెలిసినా నాకు భయం లేదు. ఏం చేస్తారు? తిడతారు, కొడతారు. అంతే కదా! నేను మానసికంగా, శారీరకంగా పవిత్రంగా ఉన్నన్నాళ్ళు. ఆయన నా మంచిని ఏం గుర్తించారు? జాగ్రత్తగా వున్నా నాకు తిట్లు దెబ్బలు తప్పలేదు కదా?"

కేశవరావు ఇంక వినదల్చుకోలేదు.

రాధ ఈ దేశంలోని సగటు స్త్రీ. ఒక మగాడు, ఒక ఆడది అన్న సూత్రాన్ని నమ్మినమనిషి. ఎలాంటి వాడయినా భర్తను గౌరవించాలని, ప్రేమించాలని నమ్మే మనిషి.

రామారావు అనుమానంమనిషి. అతని అనుమానానికి కారణాలు

తెలియవు. బహుశా భార్యను ఎప్పటికప్పుడుఅనుమానించకపోతే చెడిపోతుందనే భయంతో ఆమెను పదిలపరచుకోవాలని భావించి ఉంటాడు. ఆమెకు లేని సంబంధాలు అంటగట్టాడు. ముఖ్యంగా రామకృష్ణతో.

ఆమెకు నిజంగా చెడ్డ అభిప్రాయాలు లేవు. ఆమెది చెడ్డ ప్రవర్తన కాదు. అది గుర్తించక తనను మరీ మరీ అనుమానించి అవమానిస్తూంటే ఆమెలో అవే వూహలు చెలరేగడం మొదలెట్టాయి. అంతర్లీనంగా తనను అకారణంగా అనుమానిస్తున్న భర్త మీద కక్ష తీర్చుకోవాలన్న అభిప్రాయం కూడా వుండవచ్చు. లేదా భర్త అవే మాటలు పదే పదే అనడంవల్ల కావచ్చు. బ్రాహ్మడు, మేక సామెతలాగా....

ఆమెకు తెగించిన ధైర్యం వచ్చింది. భర్తమీద కక్ష....అతను పెడుతున్న ఆంక్షలు ఉల్లంఘించాలన్న తపన....డిఫెన్స్....శారీరకమైన కోర్కెల ఒత్తిడివలన కాదు, స్వాభావికమైన మానసిక నిశ్చయత. కావాలనే చెడింది.

చెడ్డాననుకున్నాక ఆమెకు బోలెడంత సంతృప్తి కలిగింది. ఇంక కేర్ చెయ్యకూడదన్న నిర్ణయానికి వచ్చింది. మనిషిదొంగ కానప్పుడు, 'నువ్వు దొంగవి-నువ్వు దొంగవి' అని చెవిలో జోరీగలా అరుస్తూంటే మనిషి నిజంగా దొంగవుతాడు.

ఇదో సైకాలజీ....

* * *

కేశవరావు విపరీతంగా ఆలోచించాడు.

తన కొడుకు వినయ్ దొంగ కావడం అతని కిష్టంలేదు. వెంటనే భార్యకు ఉత్తరం రాశాడు.

"....నా పెన్ మా ఆఫీస్‌లో శ్రీనివాస్ నా దగ్గర తీసుకుని ఎక్కడో పడేసాడట. నేను తిడతానని ఇన్నాళ్ళు చెప్పలేదట. ఈవేళే చెప్పాడు. నా పెన్ తీశాడని వినయ్‌ని అనవసరంగా అనుమానించాను. నేను అందుకు బాధపడుతున్నాను. వాడు నిర్దోషి. ఈ విషయం నా మాటగా వాడికి చెప్పు."

కేశవరావుకి ఈనాటికీ ఆ పెన్ ఏమైనదీ తెలియదు. వినయ్ తీసి వుండడని అతనికి గొప్ప నమ్మకం.

అంతే! *

కథా నిలయం

---

Edited & Published by VIJAYA BAPINEEDU
80, Dhanalakshmi Colony, Madras-600 026, and
Printed by him at Vijaya Graphics,
210-Arcot Road, Madras-600 026. Phone: 422233